# కేటీఆర్ ఓ సంస్కార హీనుడు

## మహిళా కాంగ్రెస్ నేత చల్లా ప్రతిభారెడ్డి

- సంస్కార హీనుడిలా మాట్లాడకు కేటీఆర్
- కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత మీకు లేదు..
- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటిపై మీ వ్యాఖ్యలు అర్థరహితం
- నాడు తుమ్మల లేకుంటే మీకు ఈ జిల్లాలో అతీగతి లేదని తెలుసుకో..
- మీడియాతో మహిళా కాంగ్రెస్ నాయకురాలు చల్లా ప్రతిభారెడ్డి

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని కనీస మర్యాద లేకుండా ఖమ్మంలో మాట్లాడిన బీఆర్ఎస్ నేత కేటీఆర్ యావత్ తెలంగాణ ప్రజల ముందు సంస్కార హీనుడిగా, నీచమైన రాజకీయ నాయకునిగా దిగజారిన పరిస్థితుల్లో కనిపిస్తున్నారనీ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రుల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైజింగ్ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని విమర్శించడమే కాకుండా వారి పేర్లు పలకడానికి కూడా కేటీఆర్ అర్హుడు కాదని ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు చల్లా ప్రతిభారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... పదేండ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కండ్లు నెత్తికెక్కాయనీ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అమరులు అవుతున్న విద్యార్థులు, ఉద్యమకారుల కుటుంబాలను, వారి త్యాగాలను గౌరవించి నాటి కాంగ్రెస్ అధినేత్రి సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారనీ, ఇలాంటి కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను, మంత్రులు తుమ్మల, పొంగులేటిని ఇష్టం వచ్చినట్టు మాట్లాడి కేటీఆర్ ప్రజల ముందు దిగజారి పోయారని ఆమె ఎద్దేవా చేశారు. భట్టి విక్రమార్క నాడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి విశేషంగా కృషి చేశారనీ, మంత్రి తుమ్మల, పొంగులేటి రాకతో కాంగ్రెస్ పార్టీలో సరికొత్త జోష్ రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఈ ముగ్గురి ప్రభావం బాగా పనిచేసిందనీ, ఫలితంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి తొమ్మిది స్థానాల్లో తిరుగులేని విజయాలను నమోదు చేసుకున్నామని ప్రతిభారెడ్డి గుర్తు చేశారు. కేసీఆర్ పాలనతో దివాళా అంచున ఉన్న తెలంగాణను అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, అభివృద్ధి పథాన పరుగులు పెట్టిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నలభై ఏండ్ల తన రాజకీయ జీవితంలో ఏ నాడూ ఒక విమర్శ ఎదుర్కోని తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి ఒక్కరిని కూడా అసెంబ్లీ గేటు తాకన్వినని గత ఎన్నికల్లో శపథం చేసి బీఆర్ఎస్ పతనానికి నాంది పలికిన పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కేటీఆర్ అనేక రకాలుగా నోటికొచ్చినట్టు తిట్టి అసలే దిగజారిపోయిన తన స్థాయిని మరింతగా దిగజార్చుకున్నారని ప్రతిభారెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రులు రాష్ట్ర ప్రజల అండతో సమిష్టిగా మీ బీఆర్ఎస్‌ను ఓడించి మిమ్మల్ని ఇంటికి పంపారని అయినా మీలో మార్పు రాలేదని ఇకనైనా హుందాగా రాజకీయాలు కొనసాగించాలని చల్లా ప్రతిభారెడ్డి కేటీఆర్‌కు హితవు పలికారు. భవిష్యత్తులోనూ ఇలాగే నోటికొచ్చినట్టు మాట్లాడితే మీకు మహిళా కాంగ్రెస్ నుండి తగిన గుణపాఠం తప్పదని ప్రతిభారెడ్డి అన్నారు.

